క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీమ్ మెంబర్లు

సరుబుజ్జిలి: ప్రకృతి వ్యవసాయం చేయడం వలన రైతులకు అన్ని విధాలుగా లాభదాయకంగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయ టీం ఎంటీ సూర్యనారాయణ తెలిపారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అశోక్, ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి, బూర్జ మండలాల వీపీఏలు, ప్రకృతి వ్యవసాయ టీం యూనిట్ ఇన్‌చార్జి లలిత పాల్గొన్నారు.

కేసుల్లో పురోగతి సాధించాలి



కోర్టు ఆవరణలో గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా జడ్జి ఫణి కుమార్

పాతపట్నం: పాతపట్నం కోర్టును ఎస్సీ, ఎస్టీ కోర్టుల జిల్లా జడ్జి ఫణి కుమార్ శనివారం వార్షిక తనిఖీ చేశారు. కోర్టు రికార్డులను సరిగా నిర్వహించాలని, కేసుల పురోగతిని సాధించాలన్నారు. కోర్టు కార్యకలాపాలు సజావుగా సాగేలా చూడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సమీక్షించి, వాటి పురోగతిని ట్రాక్ చేయాలన్నారు. కోర్టు భవనం శిథిలావస్థలో ఉండడంతో నూతన కోర్టు భవనం నిర్మాణం త్వరలో చేపట్టాలన్నారు. కోర్టు కోసం వైటీసీ భవనాన్ని పరిశీలించారు. జిల్లా జడ్జికి కోర్టు ఆవరణలో పోలీసులు గౌరవవందనం చేశారు. పాతపట్నం జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి, తహసీల్దార్ ఎస్.ప్రసాదరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యం, న్యాయవాదులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



నేల బావిని క్లోరినేషన్ చేస్తున్న ఆరోగ్యశాఖ సిబ్బంది

సరుబుజ్జిలి: పరిసరాలను పరిశుభ్రంగా ఉన్నప్పుడే అంటువ్యాధులను దూరం చేయగలమని రావివలస సర్పంచ్ వండాన కృష్ణ తెలిపారు. గ్రామంలో శనివారం పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం బోర్లు, నేలబావుల్లో బ్లీచింగ్ పౌండర్ వేసి క్లోరినేషన్ చేయించారు. పంచాయతీ కార్యదర్శి శైలజ, ఏఎన్ఎం తేజ, ఆశ వర్కర్ భవాని పాల్గొన్నారు.


వరుస క్రమంలో నాట్లు వేయాలి



వరుసక్రమంలో నాట్లు వేస్తున్న కూలీలు

ఆమదాలవలస: ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా మండలంలో చేపేనపేట గ్రామంలో రైతులతో వరుస క్రమంలో వరినాట్లను వేయించే కార్యక్రమాన్ని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చేపట్టారు. డీపీఎం పూజారి సత్యనారాయణ ఆదేశాల మేరకు మండలంలో ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు ప్రకృతి వ్యవసాయ పీడీఎఫ్ సురేష్ శనివారం తెలిపారు. లైన్ షోయింగ్ విధానంలో నాట్లు వేయడం వలన తెగుళ్లు, పురుగుల బారిన పడే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. ఈ పద్ధతి ద్వారా మంచి దిగుబడిని సాధించవచ్చన్నారు. వరి పంటలో రాజీలేని సూత్రాలు పాటిస్తే రైతులు ఆశించిన ఫలితాలను పొందగలరని తెలిపారు.

సమయపాలన తప్పనిసరి



సచివాలయ ఉద్యోగులకు సూచనలిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ గోవిందరావు

హిరమండలం: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని డిప్యూటీ ఎంపీడీఓ డి.గోవిందరావు అన్నారు. మండలంలోని మహలక్ష్మీపురం సచివాలయాన్ని శనివారం సందర్శించారు. పి-4 సర్వేను పూర్తిచేయాలన్నారు. స్వామిత్వ సర్వే ప్రారంభించాలన్నారు. సచివాలయ ఉద్యోగులందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులపై గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మంచినీటి వనరులలో క్లోరినేషన్, పారిశుద్ధ్య పనులు చేయించాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు.

ఆక్రమణ చెరలో చెరువులు



పాతపట్నం మండల కేంద్రంలో ఆక్రమణలకు గురై చిక్కిపోయిన ఎర్ర చెరువు

- సాగునీటి నిల్వ సామర్థ్యం కోల్పోతున్న చెరువులు
- ఏటా రైతులకు సాగునీటి తిప్పలు
- పట్టించుకోని అధికారులు

పాతపట్నం: చెరువులు..వర్షపు నీటిని ఒడిసి పట్టిందుకు, ఆ నీటితో పంటలను సాగుచేయాలన్న పూర్వీకుల ఆలోచనకు ప్రతిరూపాలు. చెరువులో నీరుంటే.. పంటలకు సమృద్ధిగా అందుతుంది. అవే చెరువులు ఆక్రమణలకు గురై సాగునీటి నిల్వ సామర్థ్యాన్ని కోల్పోతే.. వర్షం నీరు చేరిన కొద్దిరోజులకే ఎండిపోతుంది. సాగునీటి కష్టాలు అరంభమవుతాయి. పొట్ట దశలో పంటలు ఎండిపోతాయి. పెట్టుబడి అంతా మట్టిలో కలిసిపోతుంది. ప్రస్తుతం పాతపట్నం నియోజకవర్గంలో రైతులకు ఇవే పరిస్థితులు ఎదురవుతున్నాయి. చెరువులు యథేచ్ఛగా ఆక్రమణలకు గురువుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. సాగు నీటి చెరువుల రూపురేఖలు మారిపోతున్నాయి. ఏటా రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. చెరువు గర్భాలు పంట పొలాలుగా, ఇళ్ల స్థలాలుగా మారిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆయకట్టుకు నీరు అందక అష్టకష్టాలు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. వీఆర్వోలు, రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే సాగు నీటి చెరువులు ఆక్రమణలు జరుగుతున్నాయని, దీని వెనుక లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



పాతపట్నం మండలం తిడ్డిమిలో ఉన్న ఊర చెరువు గట్టుపై ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన దృశ్యం

పాతపట్నం నియోజకవర్గంలోని చెరువులు, ఆక్రమణలు ఇలా..

మండలం	పాతపట్నం	కొత్తూరు	హిరమండలం	మెళియాపుట్టి	ఎల్.ఎన్.పేట
చెరువులు	340	236	134	168	152
ఆయకట్టు	18,500	24,500	8,825	20,158	12,621
ఆక్రమణల్లో ఉన్నవి	150	180	75	83	80

ఆక్రమణలు తొలగించాలి



చెరువుల ఆక్రమణలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రతి ఏటా ఫిబ్రవరి నుంచి మే నెల వరకు యంత్రాలతో చెరువు గర్భాలను చదును చేసి పంట పొలాలుగా తయారు చేస్తున్నారు. నగరంలోని ఉన్న చేరువులు ఇప్పటికే చాలావరకు ఆక్రమణలకు గురయ్యాయి. పాతపట్నంలో ఉన్న ఎర్ర చేరువు, తాటి చేరువుతోపాటు పలు చేరువులు ప్లాట్‌లుగా మార్చేసి ఇళ్ల స్థలాలుగా విక్రయిస్తున్నా.. రెవెన్యూ, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. నగరంలో చెరువులు ఆక్రమణలు జరుగుతున్న వ్యవహారం రెవెన్యూ సిబ్బందికి తెలిసినా వారికేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. సామాన్య రైతులు కూడా ఏమీ చేయలేని పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి.

– బి.నారాయణమూర్తి, దుర్గమ్మగుడి కాలనీ, పాతపట్నం

చర్యలు తీసుకుంటాం



చెరువుల ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం. ఉపాధి పనుల్లో భాగంగా చెరువుల్లో పనులు చేస్తున్నప్పుడు చిన్న, చిన్న ఆక్రమణలు తొలగిస్తున్నాం. రీ సర్వేలో చేరువుల ఆక్రమణలను గుర్తిస్తున్నాం. ఆక్రమణలు జరిగాయని రైతులు తమ దృష్టికి తీసుకువస్తే చెరువును సర్వే చేయించి ఆక్రమణలు తొలగించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం.

– ఎస్.ప్రసాదరావు, తహసీల్దార్, పాతపట్నం

సాగునీటి చెరువులు ఇప్పుడేవి?

పాతపట్నం నియోజకవర్గంలోని పాతపట్నం, హిరమండలం, కొత్తూరు, మెళియాపుట్టి, ఎల్.ఎన్.పేట మండలాలున్నాయి. ఆయా మండలాల్లోని రెవెన్యూ గ్రామాల పరిధిలో ఉన్న అనేక సాగునీటి చెరువులు కనుమరుగయ్యాయి. మరికొన్ని చెరువులు సగం వరకు ఆక్రమణకు గురయ్యాయి. వేలాది ఎకరాలకు సాగునీరు అందివ్వాల్సిన చెరువులు రూపం కోల్పోతున్నాయి. రోడ్డు పక్కన, నగరం మధ్యలో ఉన్న చెరువులు కాసులు కురిపిస్తున్నాయి. రెవెన్యూ అధికారులను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రసన్నం చేసుకుని తప్పుడు సర్వే నంబర్లు వేసుకుని చెరువు గర్భాలను సైట్‌లుగా మార్చేస్తున్నా అడిగే నాథుడే లేకుండా పోయాడు. మరికొన్ని చెరువులు ఇటుక బట్టీలకు కేరాఫ్‌గా మారాయి.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గిరిజన నాయకులు

కొత్తూరు: గిరిజనుల సమస్యలను పరిష్కరించడంతో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న అన్నారు. కొత్తూరులో శనివారం ప్రపంచ ఆదివాసీల దినోత్సవం సందర్భంగా ఈ నెల 1 నుంచి 9 తేదీ వరకు నిర్వహిస్తున్న వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అప్పన్న మాట్లాడుతూ.. ప్రధానంగా తాగు నీరు, రోడ్లు, వైద్య, విద్య, తదితర రంగాలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. జిల్లాలో ఐటీడీఏ లేకపోవడంతో గిరిజన సమస్యలు తెలియజేసేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. గిరిజనుల సమస్యలను పరిష్కరిస్తున్నట్లు కూటమి ప్రభుత్వం గొప్పలు చెబుతోంది తప్ప.. గిరిజనుల సంక్షేమం కోసం కనీసం పట్టించుకోవడం లేదన్నారు. ప్రపంచ ఆదివాసీ వారోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. గిరిజన నాయకులు సవర రవి, సవర రవినాథ్, సవర అబ్రహం, సవర రంగారావు, ఆరిక గణపతి, తదితరులు పాల్గొన్నారు.

‘కూటమి పాలన మోసాలమయం’



సరుబుజ్జిలి: బూర్జ మండలం పాలవలసలో కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరిస్తున్న చింతాడ రవికుమార్

ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, ఏడాది పాలనంతా మోసాలమయంగా మారిందని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గం సమన్వయకర్త చింతాడ రవికుమార్ తెలిపారు. బూర్జ మండలంలోని పాలవలస, లక్కుపురం గ్రామాల్లో శనివారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ కన్వీనర్ ఖండాపు గోవిందరావు, పాలవలస సర్పంచ్ జల్లు అంబుజాక్షి, గుమ్మడి రాంబాబు, జల్లు బలరాంనాయుడు పాల్గొన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీలోని 14వ వార్డు ఐజెనాయుడు కాలనీలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్‌కుమార్, పార్టీ నాయకులు బి.వి.రమణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి చింతాడ రవికుమార్ హాజరయ్యారు. నరసన్నపేట మండలంలోని సత్యవరం, దేశవానిపేటల్లో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు ఆధ్వర్యంలో, సారవకోట మండలంలోని బద్రి, లక్ష్మపురం, బైదాలాపురం గ్రామాల్లో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, వైస్‌ఎంపీపీ గుణుపురం రామారావు, డీఎల్‌డీఏ చైర్మన్ నక్క తులసీదాస్ ఆధ్వర్యంలో, జలుమూరు మండలంలోని పాగోడు, దరివాడ గ్రామాల్లో ఎంపీపీ వాన గోపి, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, జిల్లా కార్యదర్శి మొజ్జాడ శ్యామలరావు, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు దామ మన్మధరావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కూటమి నాయకులు మోసాలను వివరించారు. పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



నరసన్నపేట: దేశవానిపేటలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సారవకోట: బద్రిలో క్యూఆర్ కోడ్‌ను చూపిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు



జలుమూరు: పాగోడులో క్యూఆర్ కోడ్‌ను చూపిస్తున్న ఎంపీపీ గోపి, వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆమదాలవలస: ఐజెనాయుడు కాలనీలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

వితరణ..

కొత్తూరు: మండలంలోని మహసింగి గ్రామ సమీపంలోని వరహలక్ష్మి నరసింహం ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి 115 భోజనం ప్లేట్లను పొనుటూరు సర్పంచ్ ఎద్దు చామంతి కుమారుడు సంతోష్ కుమార్ శనివారం అందజేశారు. సంతోష్ కుమార్ దంపతులకు కుమారుడు పుట్టిన సందర్భంగా వీటిని సమకూర్చారు. ఆలయంలో అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. సంతోష్ కుమార్ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు గోగులు వరప్రసాదరావు నాయుడు, భానుమూర్తి, జానకిరామయ్య, సభ్యులు సత్కరించారు.

పీఎంశ్రీ పాఠశాలలకు నిధుల విడుదల

నరసన్నపేట: స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశభక్తి, ఐక్యత, ప్రజాస్వామ్య స్ఫూర్తిని పెంపొందించడం కోసం పీఎంశ్రీ పాఠశాలల్లో స్వాతంత్ర్య వేడుకలు నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేసిందని ఎంఈఓ-1 శాంతారావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు వచ్చాయన్నారు. ఒక్కో స్కూల్‌కు రూ.25 వేలు మంజూరు చేశారన్నారు. నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కరవంజ మోడల్ స్కూల్, బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఈదులవలస మోడల్ స్కూల్‌లు గతంలో ఎంపిక కాగా వీటికి ప్రత్యేక నిధులు వచ్చాయన్నారు. ఈ మొత్తాన్ని ఎలా వినియోగించాలో సూచిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. జాతీయ జెండా, సౌండ్ సిస్టమ్‌కు రూ.2 వేలు, ఆటల పోటీలకు రూ.5 వేలు, చారిత్రక ఘటనలపై నాటికలు ప్రదర్శనకు రూ.3 వేలు, వ్యాసరచన, క్విజ్ పోటీలకు రూ.5 వేలు, పెయింటింగ్, పోస్టర్ తయారీ, బహుమతులు, రిఫ్రెష్‌మెంట్, స్నాక్స్‌కు రూ.10 వేలు వినియోగించాలని సూచించారన్నారు.

రేషన్ డీలర్లకు కీ రిజిస్టర్లు..

సారవకోట: రాష్ట్ర ప్రభుత్వం ఒకపక్క రేషన్ సరుకులు ఎక్కడి నుంచి అయినా తీసుకోవచ్చని ప్రకటనలు జారీ చేస్తోంది. మరోపక్క రేషన్ డీలర్లకు కీ రిజిస్టర్లు పంపిణీ చేసింది. ఈ కీ రిజిస్టర్ల ప్రకారం ఏ రేషన్ డిపోలో ఉన్న లబ్ధిదారులు ఆ రేషన్ డిపో నుంచి మాత్రమే సరుకులు విడిపించుకోవాలని, రేషన్ డీలర్లు గ్రామాల్లో వారికి మాత్రమే రేషన్ సరుకులు తమ డిపో నుంచి అందిస్తామని చెబుతున్నారు. గత ప్రభుత్వంలో రేషన్ సరుకులను ఇంటింటికీ వెళ్లి అందజేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రేషన్ సరుకులు రేషన్ డిపోలకు వెళ్లి తీసుకోవాల్సి వస్తోంది. దీనికి తోడు కొత్తగా ఈ విధానం తీసుకురావడంతో ఒక గ్రామంలో రెండు, మూడు రేషన్ డిపోలుంటే.. ఏ డిపో పరిధిలో ఉన్న లబ్ధిదారులు ఆ రేషన్ డిపోకు వెళ్లి సరుకులు తీసుకోవాలి. దీంతో మరింత ఇబ్బందులు పెరిగే అవకాశం ఉంది.

పింగళికి ఘన నివాళి



జాతీయ జెండాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

సారవకోట: మండలంలోని అవలింగి జేబీటీ పాఠశాలలో జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిన్నారులు జాతీయ జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. జాతీయ జెండా విశిష్టతను పాఠశాల డైరెక్టర్ మోహనగాంధీ వివరించారు.

ప్రత్యేక అలంకరణ



శావణ మాసం రెండో శనివారం స్థానిక వేంకటేశ్వరాలయంలో శ్రీనివాసుడు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ చేశారు.

– నరసన్నపేట

జంగిల్ క్లియరెన్స్ చేయాలి



ఈ చిత్రం సరుబుజ్జిలి మండలంలోని సుబ్బపేట వద్ద రహదారికి ఇరువైపులా గుబురుగా ఉన్న పొదలు. సరుబుజ్జిలి మండలంలోని సవళాపురం జంక్షన్ నుంచి యరగాం వరకు గల ఆర్‌అండ్‌బీ రహదారిలో తుప్పలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడంలేదు. దీనివలన తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

ప్రజలపై పన్నుల భారం తగదు

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



హిరమండలం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలపై పన్నుల భారం మోపుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. అధిక విద్యుత్ చార్జీలు పెంచి పేదలపై మరింత ఆర్థిక భారం మోపడం ఈ ప్రభుత్వానికి భావ్యం కాదన్నారు. ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచే ప్రసక్తే లేదని కూటమి నాయకులు ఊదరగొట్టారని, అధికారం చేపట్టిన నుంచి పలుమార్లు విద్యుత్ చార్జీలు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యావసరాల ధరల పెంపుతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. చంద్రబాబు పాలన బాబు ష్యూరిటీ.. బాదుడు గ్యారెంటీలా ఉందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కిందని మండిపడ్డారు. ఒకేసారి విద్యుత్ చార్జీలు పెంచితే ప్రజలు తిరుగుబాటు చేస్తారని భావించి విడతల వారీగా విద్యుత్ చార్జీలతోపాటు అదనపు చార్జీల భారాన్ని పెంచుతున్నారన్నారు. విద్యుత్ చార్జీలు పెంచే చర్యలను ప్రభుత్వం నిలిపివేయాలన్నారు.

ఫోన్లు అప్పగిస్తాం..



ఐసీడీఎస్ కార్యాలయంలో నోటీస్ అందజేస్తున్న లతాదేవి, తదితరులు

ఆమదాలవలస: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు ఇచ్చిన ఫోన్లను ఈ నెల 4వ తేదీన సీడీపీఓ కార్యాలయంలో అందజేస్తామని డేటా ఎంట్రీ ఆపరేటర్ అమర్‌కు శనివారం నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ ఆగస్టు 5 నుంచి ఆన్‌లైన్‌లో పర్యవేక్షణ చేయలేమన్నారు. చిన్నారుల హాజరు, లబ్ధిదారుల ఆహారం, సరుకులు పంపిణీ మొత్తం రికార్డుల్లో నమోదు చేస్తామన్నారు. ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలన్నారు. కొత్తగా తీసుకువచ్చిన మాతృ వందనం పథకాన్ని అమలు చేయబోమని తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణకు ఇచ్చిన ఫోన్లు పోషణ ట్రాకర్, బాల సంజీవిని యాప్‌లకు సపోర్టు చేయడం లేదన్నారు. లబ్ధిదారుల ఫొటో క్యాప్చర్, ఓటీపీ, ఎఫ్ఆర్ఎస్ ద్వారానే సరుకులు ఇవ్వాలని పెట్టిన నిబంధన అమలు చేయటానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సరుకులన్నీ ఒక్కసారి రావడం లేదని, నెట్ సిగ్నల్ లేకపోవడంతో సక్రమంగా ఫోన్లు పని చేయకపోవడంతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని యాప్‌లు కలిపి ఒక యాప్‌గా మార్పు చేయాలని, ఎఫ్ఆర్ఎస్ ఇన్, అవుట్ రద్దు చేయాలని, కేంద్రం నిర్వహణకు ట్యాబ్‌లు, 5జీ నెట్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ జిల్లా యూనియన్ నాయకురాలు పంచాది లతాదేవి, సెక్టార్ అధ్యక్షురాలు పి.భూలక్ష్మి, అంగన్‌వాడీలు లక్ష్మి, సునీత, తదితరులు పాల్గొన్నారు.

పీ-4 లక్ష్యాలను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీఓ రవీంద్ర ప్రసాద్

పాతపట్నం: పీ-4 లక్ష్యాలను తక్షణమే పూర్తిచేయాలని డిప్యూటీ ఎంపీడీఓ రవింద్ర ప్రసాద్ అన్నారు. పాతపట్నం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ శిర్ల వేణుకుమారి అధ్యక్షతన శనివారం గ్రామ సభ నిర్వహించారు.

ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీఓ మాట్లాడుతూ ఇటీవల పంచాయతీలో బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. గుర్తించిన కుటుంబాలకు మార్గదర్శకాలను అనుసంధానం చేయడం జరుగుతుందన్నారు. ఈఓ రామచంద్రరరావు, శిర్ల జోగారావు, రాజేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రేపు

పాతపట్నం: ఈ నెల 4వ తేదీన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నారు. ఈ మేరకు తహసీల్దార్ ఎస్.ప్రసాదరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీఆర్ఎస్‌లో టెక్కలి డివిజన్‌కు చెందిన తొమ్మిది మండలాల అధికారులు హాజరవుతారన్నారు. ప్రజా సమస్యలను పరిష్కంచుకునేందుకు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తహసీల్దార్ కోరారు.

తల్లిపాలు అమృతం



పాతపట్నం: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ అనురాధ

పాతపట్నం: తల్లిపాలతో బిడ్డకు నాణ్యమైన ప్రోటీన్లు అంది మెదడు వికసిస్తుందని, శిశువుకు సమతుల్యమైన ఆహారం అందుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ అన్నారు. మండలంలోని కొరసవాడ అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ జక్కర ఉమ ఆధ్వర్యంలో శనివారం తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన తర్వాత గంటలోగా తల్లులకు వచ్చే పాలు శిశువుకు కచ్చితంగా పట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మి, దుర్గమ్మ, శేషమ్మ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

సరుబుజ్జిలి: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని సక్రమంగా తీసుకోవాలని బూర్జ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ రొట్టవలస సెక్టార్ సూపర్‌వైజర్ జానకి తెలిపారు. మండలంలోని రొట్టవలస అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు శనివారం నిర్వహించారు. ఆకుకూరలు అధికంగా తీసుకోవడం వలన రక్తహీనత లేకుండా కిశోరి బాలికలు ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.